# రెండు ప్రశ్నలే...

శరీరమ్మీద లాఠీ దెబ్బల్లా–చినుకులు, మూడు రోజులుగా! ప్రతిపక్షాలను సస్పెండ్ జేసిన అసెంబ్లీలా– క్లాసుల్ని సస్పెండ్ చేసిన కాలేజీలు, పంజరాలను మూసేసిన కాన్వెంట్‌లు. రోడ్ల మీద అక్కడక్కడా, వొక కాలుపోయిన ధర్మదేవతల్లా రిక్షాలు...!

బస్ కాంప్లెక్స్ నుంచి బయటకు రావాలంటే – ముంగాలి లోతు వైతరణి దాటాలి. ముంగాలి లోతు నీళ్లల్లో – అక్కడక్కడా కాళ్ళకు తారు పూసిన రాళ్ళు తగుల్తాయి. ఆ రాళ్ళతోనే, టెండరు వృక్షానికి కాచిన 'బిల్స్' దులిపేసుకున్నాడు కాంట్రాక్టరు సత్తిబాబు.

ఆ వైతరణి దాటించి, లోపలకు తీసుకెళ్ళకపోతే డబ్బులివ్వనంటాడు – సత్యవరం షావుకారి. ఎలా యివ్వవో చూస్తానంటాడు రిక్షావాలా! రిక్షాలో నిండుగా కిరాణా సామాన్ల మూటలు, వాటి మధ్యలో ఉప్పు మూటలా షావుకారి! జీవితాంతం కూడేసిన సంపదల్తో వైతరణి ముందు ఆగిపోయినట్టు – ఆగిపోయేడు రోడ్డు మీద.

"....బేరం–కాంప్లెక్స్ లోపుకి గాదు..."

"కాంప్లెక్స్‌కి అనంతే – లోనకి గాదేటి?"

"....కాదు..."

"...అయితిది కాంప్లెక్సేటి?" ఉప్పు మూట ఉక్రోషంతో రిక్షా దిగి, ప్రశ్నించింది.

ఎదురుగా, హోటల్ వరండా నించి యీ దృశ్యాన్ని చూసి, విజిల్ ఊదేడు ట్రాఫిక్ కానిస్టేబుల్ శంకరనారాయణ.

"....బేగా, కళాసోల్ని పిల్సి దింపించుకో. అవతల ట్రాపిక్కోడు బిగిలూత్తండు.."

"...యిక్కడ్నించయితే, కళాసోడు – డబల్ ఛార్జీ అడుగుతాడు..."

"....అయితే, నా కెంతిస్తావ్ లోనకెళ్ళడంకి...?"

"..లోనకే గాదేటి బేరమాడేను..?"

"...కాదు..."

మళ్ళీ విజిల్ శబ్దమయ్యింది. గభాలున, రిక్షాను కాంప్లెక్స్ మెయిన్‌గేటు నుంచి, వెనుకకు తిప్పి –

"...సామాన్లు దింపుతావా? ఎనక్కి వొట్టు కెళిపోమంతావా? బేగి తేల్చు. ఆ పక్క బిగిలూ, యీ పక్క చినుకులూ, బేగి తేల్సు..." ఫెడల్సు మీద పాదాల్ని నొక్కి అడిగేడు రిక్షావాలా.

"...వోసె, వోసేటీ అన్నేయిం? వొట్టు కెళ్ళిపోతావా..? యేటీ దోతరిఫీ...?" బొజ్జ వూపుకుంటూ, తుండుగుడ్డతో తల తడవకుండా కప్పుకుంటూ, కేకలు వేసాడు షావుకారి...రిక్షా దిగి!

విజిల్ నోట్లో పెట్టుకొని – శంకరనారాయణ వొచ్చేసాడు.

"...ఏటి–రోడ్డు మీదనే బిజినెస్ పెట్టేసావేటి...?" అని, షావుకార్ని కసురుకున్నాడు.

తలమీది తుండుగుడ్డని సర్దుకొని –

"...సూడండి సార్. సామాన్లొట్టుకు పోతాడట. కాంప్లెక్సుకి అనంతే – యిక్కడిదాకేనట. లోనకి రాడట..." ఫిర్యాదు జేసాడు షావుకారి.

"...సిన్నపాటి సెరువు అయిపోయింది సినుకులకి. లోనకెళ్ళటమంతే – రిక్సాకి డేమేజి...! అయినా, బేరం లోపలికి అనన్లేదు.." రిక్షావాలా తన రీజనింగ్ తను చెప్పేడు.

"...మరా, తిరకాసు కబుర్లే వొద్దు..."

"..యేటి, తిరకాసేటి..? కళాసోడ్డబ్బులు మిగుల్సుకోడంకి..నీ యెత్తులు..."

"...యిలగయితే–నేను యాపారం సేయకర్లే.."

"...అలగయితే, నీను రిక్షా తొక్కక్కర్లే..."

లాఠీ కర్రని రిక్షా హేండల్ మీద కొట్టి, నోటిలో విజిల్ నోపాలి గట్టిగా ఊది, కోపగించిన మొహంతో–

"...యిలగైతే – నేనూ డూటీ చెయ్యక్కర్లే. ట్రాఫిక్కు...బ్రేక్ జేస్సి యిద్దరూ బాగోతమాడతార్రా. తియ్యరొరేయ్ రిక్షా. పోరా, పోరొరే సావుకారీ..." కేకలేసి, పిప్పీ, పిప్పీల్మని విజిల్ వూదేడు మళ్ళీ శంకరనారాయణ.

రిక్షావాడ్ని – షావుకారి బ్రతిమాలసాగేడు. ఇంతలో, యెటునుంచి వొచ్చేరో, లేదా నలువైపుల నుంచీ వొచ్చేరో–ప్లేకార్డుల్తో, ఎర్రజెండాల్తో...జనం...! గుంపులు, గుంపులుగా చేరారు. ఒకాయన ముందుకొచ్చి – 'సామ్రాజ్యవాది' దిష్టిబొమ్మను ప్రదర్శించి – "సామ్రాజ్యవాదం నశించాలి, దేశాన్ని తాకట్టుబెడితే సహించం, సహించం..." అని నినాదమిచ్చేడు. మరొకాయన – ఆ దిష్టిబొమ్మకు నిప్పు పెట్టేడు. ఆ తర్వాత సమూహాన్ని ఉద్దేశించి కాసేపు మాట్లాడి, మళ్ళీ నినాదాలిచ్చేడు.

"ప్రపంచ బ్యాంక్ జీతగాడు – ముఖ్యమంత్రి మోసగాడు..."

"పెంచిన విద్యుత్ ఛార్జీలు – తగ్గించాలి, తగ్గించాలి."

"ఇదేమీ రాజ్యం, యిదేమి రాజ్యం – ధరలను పెంచే దోపిడీ రాజ్యం, దొంగలరాజ్యం..."

కాంప్లెక్స్ యెదురుగా – ట్రాఫిక్ బందయ్యింది. నినాదాల గుంపు రాను రాను పెరుగుతోంది. విజిలూది, వూది ఫలితం లేక ట్రాఫిక్ శంకరనారాయణ – అక్కడ్నించి తప్పుకున్నాడు. బస్సులు నడవనీయరని తెలుసుకున్నాక – కాంప్లెక్స్‌లోపలున్న జనాలూ చేరసాగేరు.

ఇదంతా చూస్తూ, పొత్తి కమీజూ, పొందూరు పంచే యిసుమంతైనా తడవకుండా కాపాడుకుంటూ వచ్చిన ఎర్రన్నాయుడు, చిరాకుపడుతూ –

"...మా నం...కొడుకుని, కారు గొనరా అన్నాను. ఇన్నాడు గాదు. గవరమెంట్ కారుని వోడుకోవచ్చు. సొంతంగా మళ్ళా యేల... అనీసినాడు. ఆడికి పనికొచ్చినట్టుగ– బులెట్ బండి కొనుక్కుండు. ఇప్పుడు సూడండి, యెలాగ చిక్కిపోనామో. ఆటోలు, బస్సులు, అన్నీ బంద్...! ఎలాగ..? మా నం...కొడు..."అని మళ్ళీ తన పుత్రుని తిట్టుకున్నాడు.

అతని చేతి బ్యాగ్ మోసే వ్యక్తిగానీ, అతనికి గొడుగు పట్టే వ్యక్తిగానీ, అతని ఖర్చంతా భరించే వ్యక్తిగానీ, అతని మీదనే ఆశలన్నీ పెట్టుకున్న వ్యక్తిగానీ-యెవ్వరూ... ప్రతిస్పందించలేదు.

"...ఆఖరికి-అయిద్రాబాదెల్తన్నపుడు మా నం...కొడుక్కి సెప్పేను-రేపెల్లుండి పట్న మెళ్ళాలనీను! పోనీ, ఆ గ్రామీణ బ్యాంకు సెర్మేన్ గోడికయినా సెప్పురా, కారు పంపమని... అనన్నాను. మరి, అడు సెప్పలేదో..చెప్పినా, ఆ గ్రామీణ బ్యాంక్ చేర్మేన్నం...కొడుకే పంపలేదో... తరాత తేలుత్తాను. గానిపుడు సూడండి, సిక్కు..." అని కాంప్లెక్స్‌లోంచి, బయటికొచ్చి, వో హోటల్ ముందు నిల్చొని, తనకొచ్చిన యిబ్బందులకు కారకులను బండగా తిట్టి, ఆందోళనా మేఘాల సమూహాన్ని అసహనంగా చూసేడు ఎర్రన్నాయుడు. ఈసారి గూడా, అతని వెనుకనున్న వ్యక్తులు స్పందించలేదు.

ఎర్రనాయుడికి చిరాగ్గా వుంది. నోటికొచ్చినట్టు తిట్టడమేగాక, చేతికొచ్చినట్టు... యెవరినైనా కొట్టాలనిపిస్తోంది. ఇంటి దగ్గరగానీ - యీ చిరాకుంటే యిద్దరు, ముగ్గుర్ని కొట్టేసున్ను. ఇప్పుడయినా - గొడుగు పట్టిన వాడిని కొట్టొచ్చు, వాడేమీ అనడు. చేతిబ్యాగ్ మోసినోడ్ని కొట్టొచ్చు. వాడూ యేమనడు. మిగిలిన యిద్దర్నీ - యిప్పుడు గాదు, వాళ్ళ పని నెరవేర్చిన తర్వాత కొడితే బాగుంటుంది. ఔను, యీ యిద్దర్నీ అప్పుడే కొట్టాల. వీడ్ని, యీ ప్యాంటూ, షర్టూ, సర్టిఫికేట్లతో-నిల్చున్న యీ నం..కొడుకుని మాత్రం కొట్టకుండా వొదలగూడదు. కొట్టాల...! ముందు, యీడి పని నెరవేర్చాల...ఆ తరాత కొట్టాల!

"...ఔనొరే జగదీశ్వర్రావూ, ఎన్ని గంటలిలాగ పాతుకుపోతాం. ఆ జంక్షను కెళ్ళి-టేక్సీ నం...కొడుకునేనా పిలరా నమ్మీ..." అనాపేసాడు ఎర్రంనాయుడు.

జగదీశ్వర్రావు జంకుతూ -

"...అవి గూడా బందనుకుంటాను..." అని, బదులిచ్చేడు...వినయంగా.

ఆ వినయానికి ఎర్రన్నాయుడు ముచ్చటపడి, ఆందోళనకారులవేపోసారి చూసి -

"...అడ్డుసుడిగా రేట్లు పెంచిత్తే - అయిపోద్దిరో మీ పని అనన్నాను.. మా నం..కొడుక్కి కరంటు తిన్నగివ్వలేరుగాని, రేట్లు పెంచిత్తే పల్లకుంతారేటి..? పొలిటికల్ లీడర్నా కొడుకులు - బిజినెస్ జేత్తండ్రా, లాభనష్టాలంతారు? పొలిటిక్స్ - అనాది మనాదోళ్ళ గురించి ఆలోచించటం మానేసింది. కదరా...జగదీశో..." అని ప్రశ్నించేడు, మరోసారి వినయపూర్వక జవాబు కోసం.

"...అనాది మనాది గురించి ఆలోచించే-పొలిటిక్స్ యీ దివాళా స్థితిని తెచ్చింది. అన్నిటికీ సబ్సిడీలు, రాయితీలు...గవర్నమెంట్ దగ్గర నిధులన్నీ వాటికే ఖర్చయి పోయేయి..." సఫారీ డ్రెస్సులో, చేత బ్రీఫ్‌కేస్‌తో నిల్చున్న వ్యక్తి బదులిచ్చేడు. సఫారీ... మెడలో బంగారు గొలుసూ, బ్రీఫ్‌కేసు చేతి మణికట్టుకి గొలుసూ, వేళ్ళకు ఉంగరాలూ... పచ్చగా, పసుపు పచ్చగా మెరుస్తున్నాయి.

ఈ నంజి కొడుకెవుడన్నట్టుగా-చూసేరు నాయుడుగారు.

"...తయారీ ఖర్చుకంటే-తక్కువ ధరకు పంపిణీ జేస్తే, యే సంస్థయినా నష్టపోదా? నష్టాలు పూడ్చుకోవాలంటే-యీ చర్యలు తీసుకోక తప్పదు గవర్నమెంటుకి..." అని, వివరణ కూడా యిచ్చేడు మెడలో గొలుసు సవరించుకుంటూ సఫారీ వ్యక్తి.

"ఆ భోగట్టా-విద్యుత్ శాఖ మంత్రీ చెప్పేడు. షాక్ గొట్టించిన ట్రాన్స్‌కో గూడా చెప్పింది. ఇంతకీ ఎంత నష్టం...? ఎప్పట్నించీ నష్టం? ఎందుకు నష్టమొస్తోంది...? రేట్లు పెంచీడ

మొక్కటే నష్టాల్ని పూడ్చటానికి మార్గమా..?" చేతుల్ని ప్రశ్నల కొడవళ్ళు జేసాడు, సఫారీ పక్కనే నిల్చున్న తెల్ల కమీజు వ్యక్తి.

ఎర్రన్నాయుడు - కొడవళ్ళ వైపు చూసేడుగానీ - యీ నం...కొడుకెవుడని అనుకోలేదు.

ఈలోగా, హోటల్ వారు గ్రహించినట్టుంది - నాయుడు గారికి నమస్కరించి, వో కుర్చీ వేసారు. పొత్తి దుస్తుల్ని సవరించుకుని, పొగరుగా కూర్చొని - సఫారిని కొడవళ్ళకి సమాధానం చెప్పు - అన్నట్టుగా చూసేరు.

"1998-99 సంవత్సరానికి, 1930.64 కోట్ల లోటు! 1997 నుంచీ నష్టాల్లో నడుస్తోంది. గత సంవత్సరానికి 2918 కోట్లకి చేరిందని విద్యుత్ బోర్డు నివేదించింది. టెక్నికల్ పరంగా, వాణిజ్యపరంగా, పంపిణీ పరంగా నష్టాలొస్తున్నాయి. ఇవిగాక, అక్రమ కనెక్షన్ల వలనా, మీటర్లను తిరగకుండా చెయ్యడం వలనా..."

సఫారీ మెదడులో..ట్రాన్స్‌కో నివేదికల గణాంకాలు యింకెన్నో వున్నాయి.

"సరి,సరి ఆగండి. విద్యుత్ మంత్రి ప్రకటించినట్లు - టెక్నికల్ పరంగా, వాణిజ్య పరంగా నష్టాన్ని వొక శాతం తగ్గించినా 169 కోట్ల ఆదాయం పెరిగితే - మరా విధానం గురించి ఆలోచించకుండా.. ధరలెందుకు తారాజువ్వలు జేసారు?" కొడవలి కరకరలాడింది.

ఎర్రన్నాయుడి కిందులో యేమి బోధపడిందోగానీ-

"...ఏట్లోకి మోటారెట్టి నీటిని లాగేసినట్టుగ....తిన్నగ లైనుకి వైరులెట్టేసి కరెంటు లాగేసిన లం..కొడుకు లెందరున్నారో? లేబర్ కోలనీలున్నాయంతే - ఆటికి మీటర్లున్నాయేటి...? పొలాలంట బోర్ పంపులు యెన్నిటికి మీటర్లున్నాయి...? ఏవి...?" సవాల్ విసిరేడు.

ఆ సవాల్ చురుక్కుమని తగిలిందేమో, యీ చర్చను వింటూ నిల్చున్న లేబర్ కోలనీ వ్యక్తి, చేతిలోని బీడీని పూరాగా దమ్ములాగి, పారేసి-

"...అయితేటి..? అన్ని వొందల కోట్లూ-లేబరు కోలనీ వోళ్ళ వల్లనే నష్టమొస్తుందా? మీటర్లకి-సెక్రమడ్డేసి తిరక్కుండా సేస్సిన మిల్లులెన్ని లేవు? ఫేక్టరీలెన్ని లేవు? లాడ్జింగ్‌లెన్ని లేవు? ఓసొసే...మనకాడా? వొద్దొద్దు - అడ్డుసుడి వోదనకయితే...తొలిసూరు మనం.. ఆః! అసలకి - లైన్ల మీద యెంత కరంటు పోతన్నాది, టాన్సుఫారాలకాడ తగలబడీదెంతా...? ఇవన్నీ లెక్కెయ్యండివోయ్...? లేబరోడూ, రైతోడూ...అనాది! అసలకి, లేబరోడూ, రైతోడూ వున్న పల్లెటూరికి కరెంటే వుండదు.." మొహం కందగడ్డలా చేసుకు మాట్లాడేడు! అతడు మాట్లాడినంత సేపూ - కాళ్లు యెగుడూ, దిగుడుగా వేస్తూ ఊగుతుండేవాడు. మాట ఆగితేగానీ, కాళ్ళ కదలిక ఆగలేదు.

పొత్తి దుస్తుల ఎర్రంనాయుడికి కోపమొచ్చింది. తన్నుదునా - నం...కొడుకుని అని క్షణకాలం చూసేడు. గానీ, వాడి కాళ్ళ కదలిక, తన కాళ్ళ కదలిక కంటే స్పీడ్ అని గుర్తించి, తగ్గేడు. అంతలో, వాడి ఆఖరి మాటలు గూడా తనకి నచ్చేయి. రైతోడున్న పల్లెటూరికి కరెంటే వుండదన్న సత్యాన్ని చెప్పినవాడు గనక, మెప్పుకోలుగా చూసేడతన్ని.

ఈలోగా బ్రీఫ్‌కేస్ గొంతు సర్దుకొని -

"...వొకప్రక్క పంపిణీ నష్టాలు, మరోప్రక్క కొన్ని సెక్షన్స్‌కి యిచ్చే రాయితీల వలనా నష్టాలు పెరుగుతున్నాయి..." అని, యింకా, యేదో వివరించబోయేడు. ఈలోగా,

"...ఆ రాయితీలని – మనలాంటి వాళ్ళ మీద పడేస్తాది ప్రభుత్వం. మనం చచ్చినట్టుగ, పెంచిన రేట్లని భరించాలి. కరెంట్ వాడకం మానుకోలేము, రాయితీలనా...పొందలేము.." దవడలు చప్పరించి, నిరసన తెలియజేసాడో, ఎంటర్‌ప్రైజెస్ ఏజన్సీదారుడు.

"...ఎవులి రాబడికి తగినట్టుగ ఆళ్ళకి పన్నులూ, కర్సులూ ఉండవేటి?"

"అందరికొకలాగే యెలగకుదుర్తాది?" ఎగుడు దిగుడు కాళ్ళవాడు, యెదురు తగిలేడు. ఎంటర్‌ప్రైజ్‌వారు, యే మాత్రము తగ్గకుండా, యెంతో తెలివిగా –

"...ఎవరి జుత్తుకి వాళ్ళు నూనె ఖర్చు భరిస్తారు గానీ, మరోతల మాసిన వాడి ఖర్చు భరించరు గదా..." జవాబిచ్చేరు.

అందుకు ఆ యెగుడు, దిగుడు కాళ్ళవాడు, కాసేపు ఎంటర్‌ప్రైజుని కళ్ళారా నవ్వుతూ చూసి, చుట్టూరా వున్న జనాన్నీ అదే మోముతో చూసి –

"...జుత్తు వొత్తు గున్నోడికి నూనె కర్సవదేటి. బోడిగుండుకీ అదే కర్సంతెలాగ...? వోసే..! వోసన నూనె సోకుకి, వోసామాత్రం కర్సెట్టుకోరేటి?" అని ఎడమ అరచేతి మీద, కుడిచేతి మడమతో చప్పట్లు చరిచి, ప్రశ్నించేడు.

ఎర్రంనాయుడి కిదంతా – చూడముచ్చటగా వుంది. వాళ్ళ చర్చ సాగుతూనే వుంది, యిటువేపు జగదీశ్వర్రావు తండ్రి –

"...ఇది యింతబేగి తేల్దుగావాల? అవతల ఆలుగానీ యెళిపోతే కస్టిమే..." ఎర్రంనాయుడి వేపు చూస్తూ మాట్లాడేడు.

"మరేటి జేస్తాం? పోనీ టేక్సీయేనా సూద్రా అంతే – అవీ బందే అంటండు. దగ్గిరా, దాపా....నడకకి?...." బదులిచ్చేడు ఎర్రంనాయుడు.

అటువేపు – చర్చలను మించి...ధర్నా నినాదాలు. ఎవరో పాట పాడుతున్నారు. చినుకుల మేఘం పూర్తిగా తెరిపిచ్చి, ఎండయెక్కింది.

"...పిలక ఆడి చేతి కిచ్చేసి, కాళ్ళు బట్టుకు బతిమాల్తే లాభమేటి? ఆడ్నిగాదు – నిన్ను దన్నాల్రా జగదీశుగే. ఎందుకూ? సదువుకున్నావు, సదువు. ఆయువుపట్టు అవతలోడికిచ్చేసి– మరింకేటి దెబ్బలాడగలవు..?" జగదీశ్వర్రావుని తిట్టేడు నాయుడు.

"....దెబ్బలాటకైతే ఆడు మాత్రం ఆయువుపట్టు యిచ్చెత్తదేటి...? బతకడానికని గానీ! మరందికే, నీలాటోడి శరణు గోరేడు..." ఎర్రంనాయుడికి గొడుగు పట్టిన వాడు కల్పించుకు నచ్చజెప్పేడు.

సరస్వతీ ఎడ్యుకేషనల్ సొసైటీకి – తన సర్టిఫికేట్లిచ్చేసాడు జగదీశ్వర్రావు. టీచర్ ఉద్యోగం. జీతం మూడు వేలు. క్లాసులో పాఠాలు చెప్పటమే గాక – కరస్పాండెంట్ చెప్పే పనులన్నీ– జగదీశ్వర్రావు డ్యూటీలో భాగమే. సర్టిఫికేట్స్ యివ్వకుండా చేరితే రెండు వేలు, యిస్తే మూడు వేలు జీతం! ఎంచుకోమన్నారు. జగదీశ్వర్రావు...రెండోదో యెంచుకున్నాడు. ఆయువు పట్టు యిచ్చేశాడు.

జగదీశ్వర్రావు తండ్రికి – ఎర్రంనాయుడి మాటల్తో యింకేదో గుర్తొచ్చింది. తమ ఆయువు పట్లను..యెంత అమాయకంగా...? నిన్నటి ఘటన...

చుట్టూ, పత్తి పంట నిండిన పొలం. మధ్యలో బండి దోవ...కంకరతో వేసారు. ఆ దోవకి కొసలో పెంకుటిల్లు. పెంకుటింటి చుట్టూ, రకరకాల పూల మొక్కలు. పెంకుటింటికి యెడమ వేపు... కొద్ది దూరంలో ఆవులసాల. దానికి ఆనుకొని అవతలవేపు వోకుటీరం అందులో నాలుగు సీల్‌కమల్ కుర్చీలు, వో వాలు కుర్చీ, వొక సింగిల్ కాట్ బెడ్–కలర్

టీవీ వున్నాయి. కుటీరానికి, ఎదురుగా, మరోసాల. అందులో ట్రాక్టరొకటి, వొక హీరో హోండా మోటార్‌సైకిలూ, రెండు హీరో సైకిల్లూ, గాలిలేని ట్యూబులూ, వొకటైరూ, టూల్‌బాక్స్...పడివున్నాయి.

కుటీరంలోని టీవీలో – 'అన్నదాత' అడ్వర్టయిజుమెంట్ – పొలం నిండుగా పూచిన పొద్దు తిరుగుడు పూలు–ట్రాక్టరు పైన నవ్వులు పూచే రైతూ – యింటికి వొస్తోన్న పంటలక్ష్మీ.... కన్పించేయి. నీల్‌కమల్ కుర్చీల్లోని వాళ్ళు కళ్ళప్పగించేరు. వాలు కుర్చీలో కూర్చున్న శ్యామలరావు, పక్కనే స్టూలు మీది ఫోనందుకొని, యెవరికో డయల్ చేస్తున్నాడు. కుర్చీల్లోని వారు – ఆ ఊరి విఎఓ తర్లాడ సుందర్రావు, కర్షక పరిషత్ సభ్యుడు గులిపిల్లి తిరుపతినాయుడు, వాటర్ కమిటీ సభ్యుడు దన్నాన పోలినాయుడూ!

ఆ సమయంలో, ఆ రోజు, అక్కడికి ఎర్రంనాయుడి వెనకాల, జగదీశ్వర్రావు తండ్రీ, జగదీశ్వర్రావూ గూడా వెళ్ళేరు. ఎర్రంనాయుడ్ని చూసి, విఎఓ తప్ప అందరూ, నమస్కరించి లేచి నిల్చున్నారు. శ్యామలరావు, ఫోన్ పెట్టేస్తూ – తన కుర్చీ పక్కనే వున్న సింగిల్ కాట్‌బెడ్ మీద కూర్చోమని ఆఫర్ చేసాడు.

ఎర్రంనాయుడు–బెడ్ మీద విరామంగా చేరబడ్డాడు. అప్పుడు, నిల్చున్న వాళ్ళంతా కూర్చున్నారు మళ్ళీ. మరి కుర్చీల్లేవు. జగదీశ్వర్రావు తండ్రి, ఆ కుటీరంలో వొక వారగా పేర్చిన టేకు కలప దిమ్మల మీద కూర్చున్నాడు. జగదీశ్వర్రావు.. తండ్రితోపాటు అక్కడ కూర్చోలేక, మరో ఆసనం లేకా – కొమ్మలన్నిటా యేవేవో పెద్ద పెద్ద పక్షులు కన్పిస్తే జడుసుకొని తల్లి రెక్కల మీద వాలిన పిల్ల పక్షిలా – తండ్రికి దగ్గరగా నిల్చున్నాడు.

"..... బాబు వొచ్చేసినారేటి?" శ్యామలరావు కాస్త ప్రాంతీయ యాసను – ఎర్రంనాయుడి కోసం వొలికిస్తూ మాట్లాడేడు.

"....దుబాయి గావాల యెళ్ళేడు? వొత్తాడు. రాకండా – అక్కడాట వుండి పోతాడేటి. దుబాయి–అతగాడి 'అత్తగారి వూరేటి?" బదులిచ్చేడు వాటర్ కమిటీ మెంబర్ దన్నాన పోలినాయుడు...ఎర్రంనాయుడికి బదులుగా.

"...అత్తగారయితే మట్టుగు వుండిపోతారేటి?" విఎఓ యెదరు ప్రశ్న వేసాడు.

"...ఇల్లరికమెళ్ళిన, నం..కొడుకు వుండడేటి?" బెడ్ మీద నుంచి, కాస్త లేచి, ప్రశ్నించేడు ఎర్రంనాయుడు.

"...బాబు అంటే నా వుద్దేశం...మన విశ్వంబాబుగారనీ.." శ్యామలరావు, కల్పించుకున్నాడు. ఎర్రంనాయుడికీ, విఎఓకీ ఉప్పు, నిప్పులా వుంటుందని తెలుసు. విఎఓ ఇల్లరిక మొచ్చినవాడు గూడా. అందుకని, ఇద్దరి సంభాషణనీ తుంచేందుకు ప్రయత్నించేడు.

అయితే – యీ సంభాషణలే ప్రధాన కాలక్షేపాలయిన మిగిలిన వాళ్ళు – శ్యామలరావు ప్రయత్నాన్ని పట్టించుకోలేదు.

"...అన్న అంటే ఎన్టీవోడూ, బాబంటే సెంద్రబాబూ, అమ్మ అంటే యిందిరమ్మా గేపకమొత్తారెవ్వులికేనా..." కర్షక పరిషత్ సభ్యుడు గులిపల్లి తిరుపతినాయుడు, తన రాజకీయ పరిజ్ఞానాన్ని ప్రదర్శించేడు.

"...వోసే, యివేటి కొత్తగొచ్చిన మాటలేటి? అంతక ముందరకి యెళ్తే తాత అంటే గాంధీ తాత గ్యాపకం వొచ్చీవోడు గాదేటి?" ఎదురు ప్రశ్నను వేసాడు వాటర్ కమిటీ మెంబర్.

శ్యామలరావు – వీళ్ళందర్నీ భరించడం నేర్చుకున్నాడు. గంటలు, గంటల కాలం...వీళ్ళు గతం మీద వృధా చర్చ చేయటం – వర్తమానాన్నించి పారిపోవటానికే అని కొద్దినాళ్ళకే గ్రహించేడు. పెద్దరికం కోసం – వీళ్ళు దేన్నయినా త్యాగం చెయ్యగలరని గూడా, వీరికి అదో బలహీనత అని గూడా గ్రహించేడు. వీరిలోని యీ బలహీనతయే – తనకు ప్రవేశాన్ని కల్పించిందా...యీ ప్రాంతంలోకి...? అని తర్కించుకున్నాడు శ్యామలరావు. స్థిరీకరణయిపోయి, యిక మీదకు యెగిరేందుకు – అక్కడ తన రెక్కల బలం చాలలేదు. డెల్టా భూముల్లో పంటల మిగులుతో – పెద్ద,పెద్ద వ్యాపారాలకి యెగిరే శక్తిగల రాబందులు అక్కడ! వాటితో తను పోటీ...! సిన్మా, రియలెస్టేట్, ఫైనాన్స్, పత్రికలు, పచ్చళ్ళు...వొకటేం విటి...అన్ని రంగాల్లో – రాబందుల రెక్కల చప్పుడు. తన రెక్కల కింకా బలం గావాలి. తను రాబందుగావాల్సే వుందింకా...! ఛఛా.... ఉపమానం బాగులేదు..ఛఛా...!

శ్యామలరావుకి...అప్పటి దాకా వున్న ప్రశాంశత చెదిరి పోయింది. వాలు కుర్చీలో అసహనంగా కదిలేడు. ఆ కుటీరానికి కనుచూపు దూరాన – రోడ్డుమీద – హారన్ మోగించుకుంటూ.... పోతోన్నవాహనాల శబ్దం! కుటీరం ముందరి పెంకుటింటి పెరట్లోంచి.... యేవో తాలింపు వాసనలు! కుటీరం–యెదురుగా ప్రత్తి పంట పొలంలో– ఆవు దూడలు...అడ్డదిడ్డంగా పరుగు దీస్తూ, అంబా...అంబా...అని అరుస్తున్నాయి. రోడ్డు మీది శబ్దం, వంటింటి తాలింపు వాసన, ఆవుదూడ రంకె...అంతరంగంలోని రాబందుల రెక్క...వొక్కసారిగా విదిలించుకోదల్చి – కుర్చీలోంచి లేవబోయేడు. పొలం నుండి దిగాలుగా తిరిగొచ్చిన తమ్ముడు ప్రతాపరావూ, అతని వెంట నలుగురు కూలీలు– కన్పించేరు.

"...యేంవర్రా? పొలం వొదిలేసి – యింటి కొచ్చేరేంరా...?" చిరాకంతా ధ్వనించిన స్వరంతో ప్రశ్నించేడు శ్యామలరావు.

ప్రతా రావొకసారి – అన్నగారి చుట్టూ చేరిన వారిని చూసి, ఈసడింపుగా –

"....వీళ్ళు బాగుపడరూ, మనల్ని బాగుపడనీరు. డబ్బూ, ధనం తీస్కొచ్చి – యీ మారుమూల నేల మీద బోసీసేవు. అక్కడ యెలా వుండేవాళ్ళం? ఇక్కడ వనవాసానికొచ్చినోళ్ళలాగున్నాం..." అన్నకు బదులిచ్చేడు.

"....అంటే, మేమంతా వనవాసులమన్నమాట?" విఎఓ, కాస్త నిష్ఠూర స్వరంతో ప్రశ్నించేడు.

"...నేను మీతో మాట్లాడలేదు..." విసురుగా బదులిచ్చి, తాలింపు వాసనల వంటింటికి నడిచేడు విసురుగా ప్రతాపరావు.

"... మీ వోడు రామన్న వెనకనే వొచ్చిన లక్ష్మణసోఁవి..." కర్షక పరిషత్ మెంబర్ తిరుపతినాయుడు, హాస్యమాడేడు.

"...అన్నకి తోడుగా వొస్తే ఫర్లేదు. శూర్పణఖ, ముక్కూ చెవుల దాకా వొస్తేనే తంటా.." విఎఓ వూరుకోలేదు.

"...రామలక్ష్మణులు, యెవరో తగిలేస్తే అయోధ్య వొదిలేసొచ్చేరు. గాని, మేము అలా రాలేదండీ.. అయినా, రామలక్ష్మణులు – హిందూ ధర్మాన్ని రక్షించేరు రాక్షసుల హతమార్చి..." శ్యామలరావు కింకేదో చెప్పాలని వుంది. ఈ సందర్భంతో – దేన్నో జతపర్చి...లోపలి ఆక్రోశాన్ని చల్లార్చుకోవాలనుంది.

"ఆర్య, అనార్య తెగల మధ్య రగిలిన సంఘర్షణలకు–కావ్యరూపం రామాయణం. గెలిచిన తెగలవారు తమ ఘనకీర్తిని చాటేటట్టు కావ్యాన్ని పొడిగించుకున్నారు..." ఊరుకోలేక, గొంతు విప్పి బదులిచ్చేడు జగదీశ్వరరావు.

శ్యామలరావు – ఆలోచనల్లోంచి, ఆశ్చర్యంగా చూసేడు.

"...మావోడే... పెద్దకొడుకు..." జగదీశ్వర్రావు తండ్రి, శ్యామలరావు చూపుకి బదులిచ్చేడు.

"...అలా అని – యీ మధ్యనే యేదో పుస్తకంలో చదివేను..." సాధ్యమైనంత వినయంగా చెప్పేడు జగదీశ్వరరావు.

ఈలోగా వంటింటి వేపు వెళ్ళిన ప్రతాపరావు, యేదో నెమరువేస్తూ వొచ్చేడు. ఆయన వెనకాల వదిన శోభమ్మ – బాలక్రిష్ణని వెంటేసుకొచ్చే యశోదమ్మలా వొచ్చింది. ఆమె, వొస్తూనే–శ్యామలరావు చుట్టూ చేరిన వారందరి వేపూ – చులకనగా చూసింది. జగదీశ్వర్రావు తండ్రి గభాల్న కూచున్న చోటు నించి లేచి నిల్చున్నాడు. తల్లి పక్షి రెక్క మీది పిల్ల పక్షిలా – జగదీశ్వర్రావుకీ లేవక తప్పింది కాదు. కర్షక పరిషత్తూ, వాటర్ కమిటీ సభ్యులు – శోభమ్మ మీద కళ్ళు నొదిలేసారు. వివిఓ చురచురా చూడసాగేడు, ఆడవారితో వ్యవహారాలు చర్చించటం అతనికి నచ్చదు. ఎర్రంనాయుడు మాత్రం, చేరబడినవాడు కాస్త లేచి, శోభమ్మని చూసి –

"...నీ మరిది నిన్ను దింపేదేటి యుద్ధంకి? ఇంతకీ, అన్నతోటి యుద్ధమా, అతగాని చుట్టూ..చేరినోళితోటా...?" అని హాస్యమాడేడు.

శోభమ్మ, కాస్త తగ్గింది. ఎర్రంనాయుడి నోరెటువంటిదో ఆమెకీ తెల్సు. అదీగాక, శ్యామలరావు కంటే లౌక్యమైనదామె.

"....ఎవరో యెగదోస్తే తగవుకి దిగిపోయే దానినా, పెదనాయనా, కూతురి సంగతి నీకు తెలవదా...?" అంటూ వగలు బోయింది.

ఎర్రంనాయుడికి మరిక, కూతురి సంరక్షణ–తన బాధ్యతైంది. దాంతో –

"...యేటి? యేటింతకీ నీ మరిది గోస?" అనడిగేడు.

"...బంధువర్గమూ, బలగమూ...ఎవరున్నారంటాడు నాయనా..." అనాపేసింది. ఇంకా వగలు బోతూ –

"...అక్కడ సంపాదించింది – యిక్కడ బుగ్గిలో పోసిడమేలా అంటాడు"

కర్షక పరిషత్ మెంబరు – నాలుకను అంగుటికి అంటించి 'చ్చొచ్చొ' కొట్టేడు. అతని వేపు, ఆత్మీయంగా చూసింది శోభమ్మ. ఎందుకో, అప్పుడే, కుర్చీలోంచి లేచి శ్యామలరావు వంటింటి వేపు నడిచేడు. శోభమ్మ – అదేపనిగా వెల్లవేస్తోన్న టీవీ గొంతు నొక్కేసి – ఖాలీ అయిన శ్యామలరావు కుర్చీలో కూర్చోబోతూ, ఆగింది. ఆమెని చూస్తూ–

"...అవునమ్మా, మీ పడమట కాసి వున్న సంపాదన – యీ తూర్పు కాసి యేటుంతాది...?" అనన్నాడు చ్చొ,చ్చొ కొట్టిన కర్షకుడే.

బోధపడలేదు శోభమ్మకి.

"...సంపాదన వొదులుకోనీ వచ్చినోళ్ళని...మిమ్మల్నే సూసినాను. యేంవలపింటి పన్జేసినారు...?"

శోభమ్మకి – అతనేం మాట్లాడుతున్నాడో? పొగుడుతున్నాడో, తెగుడుతున్నాడో అర్థం గాలేదు.

"...పోని, యెనక్కెళిపోదురంతే - యెంత పోస్సేరో, యిక్కడి బుగ్గిల..? ఇక్కడాటోళ్ళఁవి, యీ నేల బుగ్గి నెత్తినేసుకున్నోళ్ళఁవి...మాఁవే నూడు...యెలగున్నాఁమో... చ్చొచ్చొ..." అని మళ్ళీ చొచ్చో కొట్టేడు.

అప్పుడు మళ్ళీ అతణ్ణి చూసింది శోభమ్మ. అప్పుడు, కుర్చీలో కూర్చుంది, విచారంగా... ముడిచి మూల పెట్టిన తడిసిన గొడుగులా! ఆ తర్వాత.

"...అయితే, యిదే ధర్మమా?" అని ప్రశ్నించింది.

యేదో - యెవరికీ బోధపడలే. అందరూ ఆమెనే చూసేరు. "చెరువు దిగువ పొలాలు మనవయితే - చెరువు మనది కాదా?" దీర్ఘంగా, విస్తుబోతూ ప్రశ్నించింది.

"...జిరాయితీ చెరువయితే...హక్కు మనదే.." వాటర్ కమిటీ మెంబరు బదులిచ్చేడు.

"...జిరాయితీ అయినంత మాత్రాన - యేం జెయ్యటానికయినా హక్కుంటుం దనుకోకు..." వివిఓ అడ్డు తగిలేడు. తగుదునమ్మా - అంటూ, మగవాళ్ళ మధ్యకొచ్చి, మాట్లాడే శోభమ్మ మీద అసహనంతో వున్నాడు వివిఓ.

"...అంటే యేఁవిటో...?" కళ్ళు నిండుగా ప్రశ్న వేసింది వివిఓకి. వివిఓ ఆ చూపుకి నిరసనగా, కుర్చీలోంచి లేచి పోయి -

"...జిరాయితీ చెరువు అయినా - సాగునీటికే తప్పా, చేపల పెంపకానికి రూల్స్ వొప్పుకోవు..." బదులిచ్చేడు వివిఓ.

"...మరదే. ఎప్పటివో చట్టాలు! ఆ చట్టాలు - ఈమట్టి మీద వాళ్ళనీ ఉద్ధరించలేదు. ఇటు పరాయి మట్టి నుండొచ్చి ఉద్ధరించబోయే వారినీ వొప్పుకోవు.." అని యెక్కడలేని నిష్ఠూరాన్నీ వొలికించి పలికేడు శ్యామలరావు. ఆ తర్వాత, వివిఓ ఖాళీ జేసిన కుర్చీలో కూర్చున్నాడు - శోభమ్మ తన కుర్చీ ఖాళీ జెయ్యలేదు గనక.

వివిఓ... కూర్చోవటానికి కుర్చీలేదు. వెళ్ళిపోవటానికి మాటలు తెగలేదు.

"...బావగారు నిల్చునే వున్నారు..." అంది శోభమ్మ.

అప్పుడు శ్యామలరావు, కుర్చీలోంచి లేచి -

"రండీ, రండి కూర్చోండి" అని ఆహ్వానించేడు. భర్త, లేచి నిల్చోవడంతో యిక తప్పక -

"...టీ పంపించాల్నా...?" అంటూ లేచింది శోభమ్మ.

శ్యామలరావు, ఆ కుర్చీలో కూర్చుంటూ -

"...రండి బాబూ రండి. మా నేలకి నీరు లేదు, పైరు లేదు. మా జనాలకి పనుల్లేవు. పెట్టుబడి పెట్టి మీరు బతకండీ, మా జనాలని బతికించడంటే వొచ్చేం. విశ్వనాథంగారిని నమ్మివొచ్చేం. మమ్మల్ని - యే దశరథుడో, కైకేయో తగిలేస్తే...అరణ్యవాసానికి రాలేదు..." అనన్నాడు శ్యామలరావు.

రెండు చ్చొచ్చోలు కొట్టేడు మళ్ళీ కర్షక పరిషత్ సభ్యుడు. ఆయన్ని అనుమానంగా చూస్తూ, టీ పంపిస్తానన్చెప్పి, అక్కడ్నించి కదిలింది శోభమ్మ.

ఎర్రంనాయుడు, తలగడాని పక్కకి తోసేసి, సర్దుకు కూర్చొని -

"....నాకు బోధ పడనిదొకటే...! మా వోళ్ళూ - తిడతన్రు మా నం...కొడుకుని. మీరూ తిడతన్రు. మా వోడివల్ల - యిరు పక్షాల వారూ నష్టపోతండ్రా...?" అని ప్రశ్నించి చుట్ట వెలిగించి, పొగ పీల్చి వొదిలేక-

"...మీకు బోధ పడిందా, నా ప్రశ్న? అదన్నమాట!" అనడిగేడు.

"రాజకీయాల్లో వున్నోళ్ళకివి తప్పవు. మంచీ మొయ్యాల, చెడ్డా మొయ్యాల. మంచంతా మనదీ, చెడ్డంతా అప్పోజిషనోళిదీ అంటే - సబువా?" రూలింగిచ్చేడు వివిఓ.

"....అయితే, మా నం...కొడుకు - ఊరికి చేసిన మంచేటి? చెడ్డేటి? చెప్పు..." చుట్ట ఎర్రగా కాల్చి, అడిగేడు ఎర్రంనాయుడు.

"నేనెందుకు చెప్పాల..? నన్నడుగుతావెందుకు...?"

"మంచీ, చెడ్డా రెండూ మొయ్యాలన్నందుకు..?"

"....లోక తీరవా సెప్పాడు లెద్దు, యియ్యేవో.." విద్యా కమిటీ మెంబరు సర్దిచెప్పబోయేడు.

"...లోక తీరవ గాదది-మీ తీరవా...!" తగువుకి దిగేడు ఎర్రంనాయుడు. వివిఓది వొక వర్గం,విశ్వంబాబుదొక వర్గం! ఆ గ్రామం ఆదిలో పంచాయితీ రాజ్ యేర్పడిన్నాడు- ఏక వర్గంగా వుండేది. వివిఓ తాత - అక్కంనాయుడు ఆనాడు ఏకగ్రీవంగా యెన్నికైనాడు. రెండు దఫాలు గ్రామ సర్పంచ్ పదవి అతన్దే. ఆ రోజుల్లో గ్రామానికి రోడ్డూ, వీధి లైట్లూ, పాఠశాల, వొకటొకటిగా - కొత్త కొత్త సంస్థలూ, ఉద్యోగులూ, పద్ధతుల - వొచ్చేయి. మన ఊరూ, మన అభివృద్ధి, మన కట్టుబాటు - అనే సమిష్టి భావజాలమ్మీద బతుక్కొచ్చిన గ్రామంలోకి - తర్వాత్తర్వాత - కొత్త ప్రపంచం, కొత్త విజ్ఞానం, కొత్త పథకాలూ, కొత్త ద్వారాలూ - కొత్త దారులూ ప్రవేశించాయి! కొత్తలో కొందరూ, పాతలో కొందరూ... విభజనగా మిగిలింది గ్రామం.

గ్రామానికి ఆనించిన నదీ, గ్రామ సంబంధ భూములూ, గ్రామ సంబంధ వృత్తులూ, గ్రామానికి చుట్టూగల తోటలూ, గ్రామం తూర్పు దిక్కు ఆలయం...గమనించలేనంత నెమ్మదిగా పరిణామం చెందాయి. తోటలు - ఎస్‌సి, బి.సి., కోలనీలయినయి. భూములు, వ్యాపార పంటలతో, మార్కెట్లోకి నడిచి, చేతులు మారేయి. తట్ట, బుట్ట, కుండా మండ, నక్కూ, నాగలీ, ఆసర సాల, సంతతోడి, చాకలి, మంగలి, మేదరి, కుమ్మరి, కమ్మరి... వృత్తులు యంత్రాల మధ్య యిరుక్కుపోసాగేయి.

ఈలోగా లబ్ది పొందిన వారిదొక వర్గంగా, లబ్ధిపొందని వారిదొక వర్గంగా - గ్రామ సమిష్టి భావజాలం చీలింది. రాజకీయమైంది. అక్కంనాయుడి కర్థమయ్యేలోగా - గ్రామంలో ప్రతిపక్షం యేర్పడి పోయింది. ఆ గ్రామంలో 'యేకగ్రీవం' పద్ధతి చెరిగిపోయి- ఎన్నికలు ప్రవేశించాయి. ఎన్నికలు ప్రవేశించేక - గ్రామం....వార్డులయ్యింది. ప్రజలు ఓటర్లయినారు.

ఈ సందర్భంలోనే - ఆ ప్రాంత రిజర్వుడు అసెంబ్లీ స్థానానికి రెండు కోటల మధ్య పోటీ ఆరంభం! ఈ ప్రాంత గ్రామాలన్నీ - యేదో వొక కోట వేపు నిల్చోటం, గ్రామం, ఏకంగా లేకపోతే - గ్రామంలో వర్గాలు యేదో వొక కోటకు సంబంధ వర్గం గావటం!

అక్కంనాయుడుని-ఎర్రంనాయుడి తండ్రి ఓడించేడు. ఎర్రంనాయడి తండ్రిని వివిఓ తండ్రి ఓడించేడు. వివిఓ తండ్రిని - ఎర్రంనాయుడు ఓడించాడు. ఎర్రంనాయుడ్ని గానీ, ఎర్రం నాయుడి కొడుకు విశ్వనాథంనాయుడ్నిగానీ - వివిఓ గానీ, వివిఓ కొడుకులుగానీ, ఓడించలేకపోయేరు. కక్షలు పెంచుకున్నారు తప్పా - కారణాలర్థం కాలేదు. ఆ రకంగా, వివిఓ వర్గానికీ, విశ్వనాథం వర్గానికీ ఉప్పు...నిప్పు...లా వుంది!

ఇదంతా, యింత వివరంగా నేపథ్యమంతా, తెలీకపోయినా శ్యామలరావుకి, యీ వర్గాల విషయం తెల్సు. సాధ్యమైనంతగా - యీ వైరుధ్యాల్ని బతకనియ్యటం, బలహీనమైన

వర్గానికి ప్రచ్ఛన్నంగా సహకరించటం, బలమైన వర్గానికి ప్రత్యక్ష మద్దతివ్వటం, రాజీలు కుదర్చటం, రాజెయ్యటం – రెంటికీ తన వద్ద అవకాశాన్ని వుంచుకోవటం – శ్యామలరావు యెత్తుగడ. కొన్నాళ్ళకి రెండు వర్గాలంతరించి – తన వర్గం ఆధిపత్యంలోకి రావటం – అతని ఆకాంక్ష!

"...వాలి, సుగ్రీవుల తగువు తీర్చి–శ్రీరామచంద్రుడు నిందమోసాడు..." శ్యామలరావు వేపు చూస్తూ, పలికేడు వాటర్ కమిటీ మెంబర్...

"...కతలూ, కయ్యాలూ...అలగుంచండీ. ఆపండీ. చెరువు సంగతి చెప్పండి.." అడిగేడు శ్యామలరావు.

"...చెరువు దిగువ భూమంతా మీ సొంతం జేస్కోండి. సెంటు జాగా, పరాయోళ్ళికి లేకుండా చేస్కోండి. అపుడు, ఆ చెరువుల మీరు చేప పిల్లలే పెంచుకుంతారో, పాంవు పిల్లలే పెంచుకుంతారో – మీ యిస్టం. అడిగినోళెవులుండరు.." సలహా యిచ్చేడు వాటర్ కమిటీ మెంబరు.

"...నా భూంవీ, నా యిష్టం – అని నల్లమందు పండిస్తానంటే – వొల్లదు! గవర్న మెంటొప్పుకోదు..." చెప్పబోయేడు వివిఓ!

"...యే గవర్నమెంటు..? స్టేటా...? సెంటరా...? రెండింటిలా – బాబుకి పవరుంది. కదండీ..." అని, ఎర్రంనాయుడ్ని కదిపేడు శ్యామలరావు.

ఎర్రంనాయుడికి ప్రతిపక్షం వివిఓ గావటంతో – రెచ్చిపోయి, దున్నేయాలనుంది. మంచమ్మీది కాళ్ళు బారజాపి –

"...స్యేమ్రలావో, సేతావాతాలేనోళ్ళికన్నీ ఆటంకాలే. మనకేటి, యేటి సెప్పు అడ్డు..?" అని, అడ్డులేదన్నాడు.

"...వొసే, చెరువుకింద భూంవంతా కొనీసేవు గదా బావ్? అదిగో ఆ గంటేడోళ్ళ మడిసెక్కలు మిగిల్నాయి? మరెవురివి మిగిల్నాయి...?" అడిగేడు తిరపతినాయుడు.

జగదీషూ, జగదీష్ తండ్రి గతుక్కుమన్నారు.

"...మావి మాత్రం – పూరాగా యెక్కడున్నాయి? పంటల యెటా ముటీ వొచ్చీ, అప్పుల పాలయిపోయీ, పంట చాలక, బతుక్కి, యీ మట్టి వొదిలేసి, మా బాగార్లు విజీవోడ ముఠా పన్లుకెలిపోనారు. ఆళ్ళ మడిసెక్కలు నిరుటి దాక, నీనే కౌలుకి జేసినాను. నిరుడు, బాగార్లుకేటో అవుసిరమయి, తనకా యెట్టుకొని, డబ్బియ్యి మన్నారు. నాకాడెక్కడిది డబ్బు? నా బతుకు – పోసిన సమురుకీ, కాలిన వొత్తికీ సమానంగా వుంది. ఇదిగీ సేమ్రలావు బావ్ నడిగితే – తనకాకి గాదు, అమ్మకానికడిగేడు. మావోళ్ళొప్పుకోలేదు. అప్పుడు గాదా, ఎర్రంనాయుడ్ని బతిమిలాడి, తనకా యెట్నాం! అలగ, మా బాగార్లు, మడిసెక్కలు – ఎర్రంనాయుడి బావ్ కాడున్నాయ్. మా మడిసెక్కలు రెండే – మా దగ్గిటున్నాయి" వివరనిచ్చేడు జగదీశ్వరరావు తండ్రి.

"...మీ బాగార్లు, విజ్‌వోడ నించి రాడమూ, మడిసెక్కల తనకా యిడిపించడమూ, మనకి జంఝావతి రిజర్వోయిరు పూర్తవడమూ – 'అసిరమ్మ తల్లి' పిల్లల్ని కాయిడమూ– జరిగేపన్లా...?" ప్రశ్నించేడు, వాటర్ కమిటీ మెంబర్.

"...మరలాంటపుడు – తనఖా విడిపించలేనపుడలా వుంచేసే బదులు – అమ్మేయవొచ్చు గదా...?" శ్యామలారావు తమ్ముడు ప్రభాకరరావు అడిగేడు.

"పుట్టినూరిల బుగ్గవాలంతే– ఆ మడిసెక్కలుండాల..." జగదీశ్వరరావు తండ్రి – తన ఆకాంక్షయో, బాగారుల ఆకాంక్షయో – తెలీని స్వరంలో పలికేడు.

కాసేపు అందరూ నిశ్శబ్దంగా వుండిపోయేరు. తర్వాత, వివిఓ చేయి ఊపుతూ –

"....వీళ్ళకి ఉమ్మడిగా 'కొత్త మెరక' భూముంది. అయితే, అది వరకట్టాలి, పల్లం జెయ్యాలి. అదిగాని అలాగ సాగుభూమి జేసుకుంతే – యీ చెరువు దిగువు చెక్కలమ్మీసినా బతికీగల్రు. వీడి బాగార్లు – విజయవాడ వెళ్ళిపోనూ అక్కర్లేదు. ఇంకా అదృష్టం కలిసొచ్చి– ఆ జంఝావతి రిజర్వాయర్ నీరే గానొచ్చిందా – మరీ గంటేడోళ్ళ నాపలేం! ఏడాదికొక యెకరం కొనగల్రు! తిరిగి, శ్యామలరావు దొర భూముల్ని కొనీగల్రు.." అరచేతిలో వైకుంఠాన్ని చూపేడు.

ఆ అరచేతుల వేపు చూడకుండానే –

"...మెరకని వరకట్టి పల్లం జెయ్యడానికి మదుపేదీ...? ఆ వొత్తాదన్న జంఝావోతి, వొచ్చేసరికి – మా తాత్తండ్రుల తరం గడిసిపోయిది – మునిమనవల తరానికొస్తే మటుగు, మా...భూములు మిగుల్తాయేటి అపుడికి? ఇదిగాదా – నోట్ల కట్టల్తోటి, మిసన్లతోటి, కొత్త కొత్త యితనాల్తోటి.... పడమటి జిల్లాల నిండొచ్చినారా – యీ దొరలు ఈళ్ళదీ యవసాయం! ఈళకే...యికీ భూంవులు..." నిష్ఠూరమో, నిజమో, స్పష్టంగాని స్వరంలో పలికేడు జగదీషు తండ్రి.

"ఔనాను–పెట్టుబడేదీ...? బాగార్లా – విజయవాడెళ్ళి పోనారు; యీడికి యిదిగో యీ కొడుకు చదువూ, యింకా కూతురి పెళ్ళీ, యీటికి తోడు – యింటి కర్సులూ – యెక్కడ తెస్తాడు...? ఇప్పటికే అప్పుల మీద బండి యీడుస్తుండు" నొచ్చుకుంటూ, నాలుకతో చొచ్చో కొట్టేడు కర్షక పరిషత్ కమిటీ మెంబర్.

"....మరందుకే, తెలివైన పని చెయ్యాల! నష్టాలొచ్చిన కంపెనీలమ్మీసి, ఆ డబ్బుతోటి– మరొక యాపారంలోకి గవర్నెంటే దిగతంది! మనం దానికంటా – గనమా...?" వాటర్ కమిటీ మెంబర్ ప్రశ్నించేడు.

"...గవర్నమెంటే దిగి అమ్ముతుందో, వొరల్డు బేంకు అమ్మించుతందో – అది, నీకూ, నాకూ బోధపడని రాజకీయం..." బదులిచ్చేడు వివవో!

రాజకీయమనేసరికి–తన స్వంత ఆస్తి మీద దాడిలా ఫీలయి, ఎఱ్ఱంనాయుడు, చిరాగ్గా కదిలేడు. శ్యామలరావు అంతకంటే చిరాగ్గా –

"....బాబూ, రాజకీయాలూసెత్తకండి! భూంవి సంగతీ, ఆ చెరువు సంగతీ చూద్దురూ..." కసురుకున్నట్టు పలికేడు.

క్షణకాలం అందరూ మౌనం. ఆ తర్వాత ఎఱ్ఱంనాయుడు – "...నా కాడకి యీ గంటేడోడు రోజూ పారొస్తండు. డబ్బు కావాలట. కొడుక్కి – అక్కడెక్కడో అన్నామలైల బియ్యాడీ అన్పించిస్తే – యేడాత్తిరిగే సరికి – టీచరయిపోతాడని...గోస! ఆ చెరువు దిగువు మడిసెక్క తనకా యిడుకో మంటండు. ఈళ్ళ బాగార్లది నిరుడు తనకా పట్టుకున్నాను కదా అని గావోసు! గాని, మా పరిస్థితి – యీడికి తెల్దు. మా నం...కొడుకు– వొక్కాలు అయిద్రాబాదుల, మరొక్కాలు ఢిల్లీల ఏస్తండు. యిక్కడాడికి పాదం నిలకంటంది. ఇక్కడి భూముల మీది రాబడిని పట్నం లెడతాడు. ఏటేటో యాపారాలంతాడు! యేటి? ఈనోగా, ఎలక్సనొచ్చి యెళ్ళిందంటే – యిక్కడి భూంవులు అమ్ముతుంటాడు! యేటి? అయితవి అమ్మీసినా – యీటికి బదులక్కడ పట్నాల్లంట కూడేస్తండు! అదల గుంచండి. అసల బోగట్టా వేటంటే – మా యింటిల ఆడి మాట తప్పు, మరొకల్ది సెల్లదు. ఆడికంట సిన్నోడు – పెద్దోడు గానీ కాళు రెండూ ఢిల్లీ పెడితే – వొదిలేసిన అయిద్రాబాద్‌ల యీడు

కాళ్ళెడుదుమని నూత్తండు. ఆ పెద్దోడలగ పోవాలని...ఎదురు నూత్తండు. మిగిల్నోలిద్దరాడపిల్లలు..! ఆళెంతసేపూ-భూంవులొద్దు, పుట్టలొద్దు – బంగారం, డబ్బూ, యివ్వండర్రో, యివ్వండంటారు. అందుకని, భూవులు మరొద్దనీసేడు – మా నం...కొడుకు! ఆకడికీ, యీ గంటేడోడికి చెప్పేను – వొరే, కమ్మాదొరకి చెప్పుదుంలేరా అని! మరంచేత, అదిగా చెరువు దిగువు భూంవి నువ్వు కొనుక్కోవయ్యా – శ్యేమల్రావో!ఆఁ! ఏటి? ఒరే, గంటేడోడా – నువ్వూ, మీ బాగార్లూ-ఆ డబ్బుతోటి – కొత్త మెరక వరకట్టుకోండిరా..! ఏఁవో, మీ తలరాత మారిపోయి, జెంజావోతి రిజరోయిరయిపోద్దేఁవో యీ మద్దెన! ఏటి? అలగసెయ్యిరా...” అని, అటు శ్యామలరావూ, యిటు గంటేడ వారూ...యిరువురూ లబ్ధి పొందుతారన్నట్టుగా నిర్ణయాన్ని వెల్లడించేడు ఎర్రంనాయుడు...!

* * *

“....మరీ, గంటేడోడా, విజీవోడ మీ బాగార్లుకి కవురెట్నావురా...?” అడిగేడు ఎర్రంనాయుడు.

నినాదాలు, పాటల్తో ధర్నా జేసిన జనాల మీద లాఠాఛార్జీ జరిగేక – జనం చెల్లా చెదురయ్యేక, మరి కాస్సేపటికి – ఆటోరిక్షా కిరాయికి దొరికింది. జగదీశు, ఆటోని, కిరాయికి మాట్లాడి తెచ్చేడు. ఆటో సరస్వతీ ఎడ్యుకేషనల్ సొసైటీ వేపు పోతోంది. రోడ్డు మీద అక్కడక్కడా వాహనాలు తిరుగుతున్నాయి. వర్షపు చినుకులు తెరిపిచ్చి – యెక్కిన ఎండ తీవ్రంగా వుంది. బంగాళాఖాతం మీదుగా రావాల్సిన యానగాలి రావటం లేదు. ఉక్కబోతగా ఉంది.

“...కవురెట్నాను...యీ రాత్రికో, రేపొప్పద్దుటికో, వొత్తారు..” బదులిచ్చేడు గంటేడోడు.

“...ఔన్రోరె జగదీశో – అన్నామలైల బియ్యాడీ అయిపోతే – టీచరువై పోతావా...?” జగదీషని ప్రశ్నించేడు ఎర్రంనాయుడు. ఆయనకు, యెప్పుడూ యెవర్నో వొకర్ని-తిట్టడం, కొట్టడం లేదా కనీసం ప్రశ్నించడం యిష్టం!

జగదీష్‌కి జవాబు దొరకలే!

“...కడిగిన మొహంవుంతే మంచిది గదా...!” ఎర్రంనాయుడి సంచీ మోసిన వ్యక్తి. బదులిచ్చేడు.

“...ఔన్రా, కంప్యూటర్ సదువు సదవనేదేంరా...?”

జగదీశ్‌కి-జవాబు దొరకలే...!

“....తలకి తగ్గ తలపాగా యెట్టుకోటం మంచిదిగదా?” అంత చదువుకి, వీడికి అర్హత లేదు సుమా అన్నట్టు జవాబిచ్చేడు, మళ్ళీ సంచీ మోసే వ్యక్తి!

“...ఔనుగానోరే – ఆ సొసైటీవోడుగానీ, సర్టిఫికేట్లు యివ్వనని తీర్మానించు క్కూకుంటే-యేటి జేస్తావురా...?”

జగదీష్‌కి భయం పట్టుకుంది. గుండెలు వేగంగా కొట్టుకోసాగాయి. జగదీష్ తండ్రి అతి వినయంగా, అతి దీనంగా –

“మరందుకే గదా, తంవరి శరణుజొచ్చేం...” అన్నాడు.

జగదీష్‌కిదంతా, గమ్యమెరుకగాని చేసే ప్రయాణంలా వుంది. ఇంటిలో ఖర్చులకీ, తన బిఇడీ ఖర్చుకీ, అంతవరకూ వున్న అప్పులకీ – చెరువు దిగువ భూమి అమ్మకానికి తండ్రి సిద్ధం కావటం, తను...యింతో, అంతో ఆదాయమొచ్చే నౌకరీ వొదిలి బియ్యాడీకి

వెళ్ళడం – సొసైటీ వారు సర్టిఫికేట్లని తిరిగివ్వటానికి – మూడు నెలల జీతంగా నడిగితేనో..? చెరువు దిగువ భూమి....పంటనిచ్చే భూమి, అది పోయి – కొత్త మెరక సాగుజేస్తే...పంట రాకపోతేనో...? తనకి...బియ్యీడీ అయ్యేక టీచర్ పోస్ట్ రాకపోతేనో...? ప్రశ్నల బండరాళ్ళు గుండెల్లో..!

"...సూద్దుం. ఈ సొసైటీ నం...కొడుకుల్లోని వొకడు – మా చిన్నోడికి కూతుర్నిస్తానని, కట్నంవెంతడిగితే అంతిస్తాననీ...కవుర్లెడతండు! మనం...అనువులూ, మినువులూ అన్లేదు. అన్దానికి – మా యిద్దరు నం...కొడుకులు – మన చెయ్యిదాటిపోనారు గదా..!" అలా దాటిపోవడం తనకానందదాయకమన్నట్టుగా, అనువులూ మినువులూ అనకపోవటం తన స్టేటస్ సింబల్‌గా – వ్యక్తపరచి, ఆగిన ఆటో లోంచి దిగేడు ఎర్రంనాయుడు.

ఈ బంధుత్వం – తమకెలా వికటిస్తుందోనని, భయపడ్డాడు జగదీష్ తండ్రి. మళ్ళీ చేతులు జోడించేడు. ఎర్రంనాయుడు పంచె సర్దుకుని, కండువా సరిజేసుకొని, రెండు అడుగులు, సొసైటీ వారి ముఖద్వారం వేపు నడిచేక, వెనక దిరిగి చూసేరు. రెండు అడుగుల దూరంలో గంటెడోడూ, జగదీశూ కన్పించేరు. వాళ్ళతోనే నడుస్తోన్న గొడుగు పట్టే వ్యక్తిని చూసేడు. గొడుగు వ్యక్తి–ఘబాల్న అంగలు వేసి, గొడుగు ఎత్తి పట్టేడు ఎర్రం నాయుడికి. ఆ రెండు అడుగుల దూరం నిలబెట్టుకుంటూ – చేతులు జోడించేడు గంటెడోడు.

"...మనం అనువులో మినువులో తేల్సలేదని – యీడు నీలగలేడు మనకాడ! పిలక మన సేతిలుంది. ఏటి, భయపడకండి..." అభయమిచ్చి, ముందుకు అడుగులేసాడు ఎర్రంనాయుడు.

బంధుత్వాలూ, రాచకీయాలూ, పంటల రాబడులూ, వ్యాపారాలూ మాట్లాడుకుని, కాఫీ, టీల మర్యాదలు స్వీకరించి బయల్దేరి బయటకు అడుగెయ్యబోతూ, జగదీశ్ సర్టిఫికేట్ల సమస్య గురించి ముచ్చటించేరు ఎర్రంనాయుడుగారు! సొసైటీవారు – తమకి కొన్ని నియమ నిబంధనలున్నాయనీ; దాని ప్రకారంవే..సొసైటీ నడుస్తుందనీ, గానీ తమ లాంటి పెద్దల కోసం – నియమాల్ని సడలించి, సర్టిఫికేట్లిచ్చేస్తాం; అయితే నియమం ప్రకారం కట్టాల్సిన మూడు నెలల జీతాన్నీ సగానికి తగ్గిస్తాం. అది చెల్లించి సర్టిఫికేట్లు తీసుకుపొమ్మనండని చెప్పేరు.

ఎర్రంనాయుడుగారు సంతోషించేరు. ఆనందంగా, వారి నుంచి, వీడ్కోలు తీసుకున్నారు. తిరుగు ప్రయాణంలో – ఆటోలో – విషయాన్ని చెప్పేరు గంటేడవారికి! వారికి ఏడ్వాలో, నవ్వాలో..బోధపడలే!

* * *

రాత్రివేళ దాదాపుగా వీధి అంతా నిద్రలో వుంది. వీధి దీపాలు గూడా వెలగటం లేదు. గంటేడ వారింట్లో, వొక మూలన కిరోసిన్ దీపం...భయం భయంగా కాల్తోంది. ఇంటి ముంజూరు వీధి గడపలో మంచమ్మీద – విజయవాడ నిండొచ్చిన సూరన్నాయుడు, నిద్ర రాక దొర్లుతున్నాడు. ఆ ప్రక్కనే మరో మంచమ్మీద అతని కొడుకు కామేశం..యెన్నెన్నో ప్రశ్నల్తో మనసంతా...కోళ్ళు దువ్విన పెంటకాగా..కూర్చొని – ప్రక్కనే వున్న జగదీశ్ వేపు చూస్తూ... నిట్టూర్చేడు. వీరికి, ఎదురుగా ముందరి గడపలో – జగదీష్ తండ్రి నేల మీద పల్చటి కోక వొకటి పరచుకొని, చారబడి, యింటి వాసాలు, లెక్కబెడ్తున్నాడు. ఆ

యింటి యిల్లాలు, పనుల్లోంచి తెమిలి, పెనిమిటి ప్రక్కగా, ఎడమ వేపు మరో కోకగుడ్డ పరచుకొని, యింట్లోని దీపం దగ్గరకు వెళ్ళి, దాన్ని ఆర్పివేయటానికి చేత్తో గాలి విసరబోతూ, ఆగి –

"...ఔనో, దీపం అనిపీసీదా...?" అని భర్తకు కేకేసింది.

భర్తకా ప్రశ్న కంటే – సాయంత్రం విజయవాడ నిండొచ్చిన తన అన్నదమ్ముడూ, వాని కొడుకూ వేసిన –

"...విజీవోడల మరి బతుకు లేదు, వొచ్చీద్దు మనుకుంతన్నాం. తనకా యిడిపించుకోడాన్కి...దాచుకున్న కాణీ పరకా సిద్ధం చేసి, యిక బయలెళ్ళుతున్నాం – నీ కవురందింది! అయితే, తీరాగా అమ్మీడమా...? మరి మమ్మల్ని యీ ఊరు రావొద్దంతావా..? ఎపుడికేనా యీ మట్టిల బుగ్గవుదుమనుకున్నాను, మరది వొల్లగాదంతావా? పుట్టిన సోట గాక, యెక్కడ మట్టిలోనో బుగ్గి గమ్మంతావా?" ప్రశ్నలు..మళ్ళీ మళ్ళీ విన్పిస్తున్నాయి.

ఆయనకెక్కడలేని దుఃఖం కుమ్మేసింది. ఆ యింట్లో, అదే గడపలో, అదే చోట, చిన్ననాడు, తనూ తన అన్నదమ్ముడూ...నిద్రబోయే ముందు చెప్పుకున్న... పేదరాశి పెద్దమ్మ కథలూ, రాజుల కథలూ, సాహస గాథలూ గుర్తొచ్చేయి. తమ గ్రామమొక స్వరాజ్యంలా– తాము రాజపుత్రుల్లా, తమ భూముల్లో పంటల్తో...తమ సుందర భవ్య జీవితాన్ని.. కలవరించుకున్న ఘటనలు గుర్తొచ్చేయి. పంట భూంవులేగాక, పశుల సంపదా – లేమి తెలియని...బాల్యమది! ఏంవయ్యిందో, యెదిగే వయసొచ్చేసరికి – పశు సంపద తరిగింది. పంట భూమి తరిగింది. అప్పుల భారం పడింది. అప్పటిదాకా నడిపించు కొచ్చిన కుటుంబ రథాన్ని అక్కడొదిలేసి, తండ్రి కనుమూసేడు. కుటుంబరథం...రవ్వంత కదపటానికి – తన వొంట్లోని యెన్ని నరాలు తెగిపోయినాయో, యెంత రక్తం కరిగి పోయిందో! అయినా, కరువు...కరువు...! పంటకీ, యింటికీ, చేతికీ, కడుపుకీ, దూరం పెరిగిపోడం, కుటుంబం పెరగడం, అన్నతమ్ముడు...విజయవాడ వెళ్ళిపోవటం... తనకింకా.. యింకా...అలివిగాని కుటుంబ రథం మోత...

కుమిలి, కుమిలి వొక్కసారి...భోరున విలపించేడు. ఆ దుఃఖపు విస్ఫోటనం...ఆ యిల్లాలికి విన్పించింది. ఆందోళనగా దీపపు బుడ్డీ పట్టుకొని, భర్త దగ్గరకు వొచ్చి, ఆయన మొహంలోకి చూసింది! ఆయన..కన్నీటి ధారల్తో శరీరమంతా వణుకుతో, యేడ్పుని నొక్కిపట్టే విఫలయత్నంతో – వొక్కబాణం కాదు, ఒంటి నిండా బాణాలు గుచ్చుకున్న క్రౌంచ పక్షిలా వున్నాడు. ఆ యిల్లాలికి భయం వేసింది. ఆయనకు దగ్గరగా వచ్చి –

"...ఔనో...యేంవీ?, యేటీ...?" అని ప్రశ్నించి, దీపం దగ్గరగా తెచ్చింది. ఆయన దుఃఖపు ఊపిరింతంట్నీ, వొదిలి ఆ దీపాన్ని ఆర్పేసాడు. అక్కడ చిమ్మ చీకటి ఆవరించింది.

ఎదుటి వీధి గడపలో మంచమ్మీద కూర్చొని, ఆలోచనల్లో పడిన జగదీశుకీ, కామేశానికీ– యిక్కడ కూచోటానికి మనస్కరించలే! నిట్టూరుస్తూ, లేచి ఊరికి ఉత్తరం వేపు గల నాగావలి నది వేపు నడిచేరు. దోవ పొడుగునా – యెవరూ గొంతు విప్పి, యేంవీ మాట్లాడలేదు. నదిలో నీరు వొక పాయగా, ఆ చివరెక్కడో ప్రవహిస్తోంది. ఇసుక తిన్నె మీద చతికిల బడ్డారిద్దరూ!

"...మా నాయనకి అక్కడుండడం యిష్టం లేదు. ఎపుడూ, పుట్టినూరో, పుట్టిన మట్టో అంటాడు. దానికి తగ్గట్టు – మాకూ కూలి పన్లు తగ్గిపోనాయి. ఇంటిల్ల పాదిమి కూలి

జేసినా – తిండికీ, బట్టకీ, రోగాలూ, రొప్పులుకీ, సిన్మాలూ సర్దాలకి – ఆటికే సాల్దు. పిల్లలకి సదువు లేదు. ఊరెళిపోతే – జన్మభూమంటన్రు, స్కీములంటన్రు, యేదో దారి దొరకదా? ఎలిపోదుం అంటాడెప్పుడు! మేమిద్దరం ముఠా కలాసిలుంగదా – మా కలాసి పని అమ్ముకుంటే కొనడానికి రడీగున్నారు – మాలాగే, యే వూర్నిండో యెలిపోవొచ్చిన యెందరో! ఆళ్ళ కెవులికో అమ్మకం జేస్సి, చిల్లర మల్లర అప్పులు తీర్చేసి – మిగిలిన డబ్బుతోటి – తనకా యెట్టిన మడిసెక్కల్ని యిడిపించుకొని బతుకుదామని ఆశ" లో గొంతులో, గుండెల్లోంచి పలికేడు కామేశం!

నది నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది. గాలి, ఆగి ఆగి వస్తోంది. ఒడ్డుమీది, రెల్లు పొదల్లోంచి... నక్కలు ఊళ వేస్తూ గోల ఆరంభించేయి.

"...మా నాయన ఆశ అదీ! తీరా.. పెదనాయన యిలా చెప్పేడు. దాంతోటి కోపం వొచ్చి తగువుకి దిగేడు. లేకపోతే దిగడు. పెదనాయనంటే – మా నాయనకి గొప్ప గౌరవం" కామేశమే, మళ్ళీ వివరనిచ్చేడు.

జగదీష్‌కి – నిన్నటి నించీ జరిగినవన్నీ గుర్తొస్తున్నాయి. శ్యామలరావు దొర యింటికి వెళ్ళటం, రామలక్ష్మణుల కథ నిండీ, చివరికీ అటుతిరిగిటుతిరిగి – తమ చెరువు కింద భూముల అమ్మకం వరకూ పెద్దల నిర్ణయాలు, యీ రోజు పొద్దున్న ఎర్రంనాయుడితో కలిసి ప్రయాణం, విద్యుత్ ఛార్జీల పెంపుకీ వ్యతిరేక ధర్నా, సర్టిఫికెట్ల కోసం తన యాతన, కాంప్లెక్స్‌లో రిక్షావాడూ, షావుకారీ ఘర్షణా...యెక్కడా, ఘర్షణ తప్పా, సఖ్యత కన్పించలేదు. వ్యక్తుల మధ్య, వ్యక్తులకీ సంస్థలకీ మధ్య, సంస్థలకీ సంస్థలకీ మధ్య... దేశాల మధ్య...యెక్కడా ఘర్షణే! ఎందుకిలా...? ఈ ఘర్షణకు కారకం.. ఆర్థికమా. మానసికమా, రాచకీయమా?

అదే విషయాన్ని అడిగేడు కామేశానికి.

"...కామేశం, బతుకిలా, యింత కర్కశంగా, దుర్మార్గంగా, దుర్భరంగా, వుంటోందని, యిదివరకే, యెరుకలో కొచ్చింది. గానీ, యీ ఘర్షణ అనేదానికి కారణాలు గానీ, దానికి తరణోపాయాలు గానీ – తెలీటం లేదు. చూసేవా, మీ నాయనా, మా నాయనా మధ్య గూడా సఖ్యత స్థానంలోకి ఘర్షణ చోటు జేసుకుంది. నీకేవయినా బోధపడ్తోందా?" ప్రశ్నించేడు.

నిట్టూర్చేడు కామేశం! అతనికి, ప్రవాస జీవితం లాంటి తన జీవితంలో పరిమిత బంధాల మధ్య...ఘర్షణా, కాసేపుతర్వాత సఖ్యతా, కాసేపటికే ఘర్షణా...రోజువారీ అనుభవం! గానీ, జగదీశ్ ప్రశ్న, అంతకు మించిన అనుభవం గురించి!

యేమీ, బదులివ్వక, కూచోటమూ సాధ్యంగాక లేచేడు కామేశం! ఇద్దరూ, యింటి వేపు నడిచేరు.

* * *

తెల్లవారేక, కాఫీ, టీల వేళ – శ్యామలరావు నించి కబురొచ్చింది. ఎర్రంనాయుడు అక్కడే వున్నాడట! రాతకోతలు పూర్తిచేద్దాం – రమ్మని కబురు!

జగదీశు తండ్రి – అన్నతమ్ముడి కోసం చూస్తే...లేదు. కామేశం మాత్రం జగదీశుతోనే కన్పిస్తున్నాడు. ఆందోళనగా, వీధీ, ఊరూరంతా వెదికేసాడు. ఎక్కడా కనబడలేదు.

"చిన్నాయన యేడ్రా...?" అడిగేడు జగదీష్‌ని ఆందోళనగా ఆయన.

"నదికి స్నానంకిగాని వెళ్ళాడో..?" కామేశం బదులిచ్చి, నది వేపు వెళ్ళేడు. వెంట. జగదీశూ...!

నది దగ్గర వెదికేరు, ఎక్కడా జాడ లేదు. ఏమయ్యేడన్న ఆందోళనతో తిరగొస్తుంటే-

"...ముఠాకెళిపోయిన గంటేడ ముసిలోడా...? ఏరు దాటి, అటు అవతల కేసి, యెళ్తండు. యిందాక చూసేను..." చెప్పాడొకాయన!

జగదీశుకీ, కామేశుకీ..ఆయన ఎటువేపు, ఎందుకెళ్ళాడో...ప్రశ్నలు..! రెండు ప్రశ్నార్థకాల్లా నిల్చున్నారు!

♦ రచన ఇంటింటి పత్రిక - జూన్, 2003 ♦